క్లుప్తంగా

తాగునీటి సరఫరా..



బోరును మరమ్మతు చేయిస్తున్న సర్పంచ్

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: 'పల్లెల్లో తాగునీటి ఎద్దడి' వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరిజనం అనే శీర్షికతో మంగళ వారం 'సాక్షి'లో ప్రచురించిన వార్తా కథనానికి ధారూరు సర్పంచు చంద్రమౌళి స్పందించారు. లక్ష్మీనగర్ తండాలో మూడు నెలల క్రితం పాడైన బోరు, మోటారును బాగుచేయించి, గిరిజనులకు తాగునీరు సరఫరాకు కృషి చేశారు. తాగునీరు అందేలా చేసిన 'సాక్షి'కి తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే



జనన ధృవపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్

కుల్కచర్ల: గ్రామపంచాయతీకి సంబంధించిన అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తూ పారదర్శకంగా ప్రజలకు సేవలు చేయడం జరుగుతుందని పటేల్ చెరువుతండా గ్రామ సర్పంచ్ శాంతిబాయితులసిరాం అన్నారు. మంగళవారం అర్జిదారులకు ఆన్‌లైన్ జనన ధృవీకరణ పత్రాన్ని అందజేసి మాట్లాడారు. గ్రామస్తులు తమకు అవసరమైన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకొని, పొందాలని సూచించారు. మధ్యవర్తులను నమ్మరాదని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నిక



మల్లప్పకు నియామకపత్రం అందజేస్తున్న అధికారులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోటబాసుపల్లి గ్రామంలో గొర్రెల పెంపకందారుల సహకారం సంఘం లిమిటెడ్ గ్రామ అధ్యక్షుడిగా కుర్వ మల్లప్పను ఎనుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఎన్నికల అధికారి అజ్మత్ పాషా, సర్పంచు కుర్వ నాగార్జున అధ్యక్షతన గ్రామ సచివాలయంలో జరిగిన ఎన్నికలో నూతన అధ్యక్షుడిగా మల్లప్ప, వైస్ ప్రెసిడెంట్‌గా రాములు, కార్యదర్శి కుర్వ రవితో పాటు 6 మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు.

నేడు 'మీతోనేను'

మర్పల్లి: మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో బుధవారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మీతోనేను కార్యక్రమం నిర్వహించనున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మండల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముందుగానే విరబూసాయి..



పీఎస్ ఆవరణలో పూసిన మోదుగ పూలు

ధారూరు: ఫిబ్రవరి, మార్చి నెలలో పూయాల్సిన మోదుగ పూలు డిసెంబర్ చివరి వారం నుంచే పూయడం చూసి ప్రజలు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ధారూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో వికారాబాద్ వెళ్లే మార్గంలో పూసిన పూలను చూసిన ప్రతి ఒక్కరు ఆశ్చర్యానికి గురవుతున్నారు. శివునికి ఈ పూలు అతిప్రీతి పాత్రమైనవే కాకుండా.. గతంలో ఈ పూలతోనే రంగోలి జరుపుకొనే వారు. ప్రస్తుత రోజుల్లో రసాయన వర్ణాల వాడకం బాగా పెరిగిపోయినా.. పల్లెల్లో మాత్రం మోదుగ పూల రంగునే వాడటం విశేషం.

మానవత్వం చాటిన జెడ్పీటీసీ

షాబాద్: జెడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి మరోసారి మానవత్వం చాటుకున్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేతత్వం గల పట్నం.. షాబాద్‌కు చెందిన నవనీత సామ్యూల్‌ల కుమారుడు రాజు(3) దివ్యాంగుడు. పుట్టుకతోనే తలలో దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న బాలుడికి మెరుగైన వైద్యం అందించేందుకు ఆపరేషన్ నిమిత్తం రూ. లక్ష సహాయంగా వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న నిరుపేదలను ఆదుకుంటామన్నారు.

నిధులు లేవు.. గౌరవం లేదు

పేరుకే.. ఎంపీటీసీలం

- పరిష్కరించాల్సిన సమస్యలెన్నో..
- పల్లెల్లోకి వెళ్లలేకపోతున్నం..
- ప్రజలకు ముఖం చూపెట్టలేకపోతున్నం..
- కలిసి ఖర్చుపెట్టాలన్న తిరకాసుతో ప్రాదేశిక సభ్యుల అభ్యంతరం



విజయోత్సవంలో ఎంపీటీసీలు(ఫైల్)

బొంరాస్‌పేట: 'పేరుపెద్ద.. ఊరుదిబ్బ'లాగా మారింది మా పరిస్థితి. ఎంపీటీసీగా ప్రజల్లో తిరగలేక పోతున్నాం. వారు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోతున్నాం. బాధ్యత ఇచ్చి.. కాళ్లకు బంధాలు వేసినట్లు ఉంది' అని మండల ప్రాదేశిక సభ్యులు వాపోతున్నారు. మాటవరుసకే 'మూడంచెల వ్యవస్థ' అని, గెలిచి ఏడాదిన్నర కావొస్తున్నా నిధులు రావు, గౌరవంలేదు. పేరుకే ఎంపీటీసీలమని ఎంపీటీసీ సభ్యులమంటూ నిరాశ వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 15మంది మండల ప్రాదేశిక కమిటీ (ఎంపీటీసీ)సభ్యులున్నారు. ఇందులో 13మంది బీఆర్ఎస్ (బీఆర్ఎస్) వారుకాగా ఇద్దరు(చిల్మల్‌మైలారం, కొత్తూరు) కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు ఉన్నారు. మొత్తం 47 గ్రామపంచాయతీలకు సర్పంచుల నిధులు సరిపోకపోవడం, ఎంపీటీసీల నిధులు లేకపోవడం మండల అభివద్ధి కుంటుపడుతోందని వాపోతున్నారు.

కంటి తుడుపు నిధులే

2019 మే6న ఎంపీటీసీ ఎన్నికలు జరిగాయి. నెల రోజులకు జూన్4న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెలువడి పదవుల్లో కొనసాగుతున్నారు. నాటి నుంచి ఎంపీటీసీ సభ్యులకు అభివద్ధి నిధుల కేటాయింపు జరగలేదు. రెండు నెలల క్రితం జిల్లా నుంచి మండలానికి రూ.18లక్షలు మాత్రమే మంజూరయ్యాయి. గ్రామాల్లో తాగునీటి సరఫరా, మురికి కాల్వల పనుల కోసం ఖర్చుచేయాలని ఉంది. కాగా ఎంపీటీసీల వారీగా కేటాయింపులు జరుగగా.. ఒక్కో ఎంపీటీసీకి రూ.1లక్ష నుంచి రూ1.50లక్షలు మాత్రమే వచ్చాయి. చాలీచాలని నిధులు తీసుకొని దండగా అంటూ నిరాశలో ఉన్నారు. నిధుల ఖర్చు విషయంలో సర్పంచులతో కలిసి ఖర్చుపెట్టాలనే తిరకాసుతో.. నిధుల ఖర్చు జోలికి ఎవరూ పోవడం లేదు. కాగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీటీసీలు.. గ్రామాలకు వచ్చిన నిధుల కేటాయింపులో మొండిచేయి చూపించారని ఆరోపిస్తున్నారు.



మండల పరిషత్ కార్యాలయం

ఖర్చులో తిరకాసు వద్దు



పేరుకే ఎంపీటీసీలం. గ్రామాలాభివద్ధిలో సర్పంచులకు అందుతున్న నిధులు సరిపోవు. సంపూర్ణంగా అభివద్ధి జరగాలంటే ఎంపీటీసీలకు నిధులు ఇవ్వాలి. వాటి ఖర్చులో స్వతంత్రత కల్పించాలి. సర్పంచులతో కలిసి ఖర్చుపెట్టాలనే తిరకాసు వద్దు. పొంతన కొరవడి గ్రామాల అభివద్ధి కుంటుపడుతుంది.

– శ్రావణ్‌కుమార్‌గౌడ్, ఎంపీటీసీ, బొంరాస్‌పేట

నిధులు పెరగాలి



జనాభా పెరుగుదల, కొత్తగ్రామ పంచాయతీల ఏర్పాటుతో ఎంపీటీసీలకు నిధుల పెరుగుదల అనివార్యం. గెలిచిన మొదటి ఏడాది ఎలాంటి నిధులు ఇవ్వలేదు. ప్రస్తుతం 'సమస్యలు బోలేడు, నిధులు మూరెడు' అనే విధంగా కంటితుడుపుగా నిధులు వచ్చాయి. సరిపడ నిధులు ఇచ్చి.. సమాజంలో ఎంపీటీసీలు గౌరవం పొందేలా చూడాలి.

– తిరుపతయ్య, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు, తుంకిమెట్ల

టాలెంట్ టెస్ట్‌కు స్పందన



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

యాలాల: బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలస్థాయిలో నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. వికారాబాద్ జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షకు మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. వివిధ మీడియంలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి సోషల్ టెస్ట్‌కు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా స్థాయి టెస్ట్‌కు తెలుగు మీడియం నుంచి ఎంపికైన విష్ణు(బాలుర ఉన్నత పాఠశాల), అఖిల(రాస్నం), రాంచరణ్(జుంటుపల్లి) ఉండగా.. ఇంగ్లీషు మీడియం నుంచి శ్రీహరి(యాలాల బాలుర ఉన్నత పాఠశాల), శ్రీనిధి(టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కోకట్), అక్షయ(యాలాల బాలుర ఉన్నత పాఠశాల) ఎంపికైనట్లు సోషల్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల బస్వరాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుభాషిణి, రవి, చంద్రశేఖర్, వెంకటేశ్, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్ తదితరులు ఉన్నారు.

7న టాలెంట్ టెస్టు

దౌల్తాబాద్: జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా సాంఘిక శాస్త్రం ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. సాంఘికశాస్త్రంలోని పలు అంశాలపై నిర్వహించిన పరీక్షలో 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన తెలుగు, ఇంగ్లీషు మాధ్యమ విద్యార్థులకు జిల్లా స్థాయికి ఎంపిక చేశామని, వారికి ఈ నెల 7న టాలెంట్ టెస్టు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, మండల బాధ్యులు సోమురాజు, ముస్తాక్‌పటేల్, హన్మయ్య తదితరులున్నారు.

వార్డులన్నీ అభివృద్ధి చేస్తా..

మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: మున్సిపల్ పరిధిలోని వార్డులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాతకొడంగల్ గ్రామంలో మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, బూట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంకర్‌నాయక్, మున్సిపల్ సిబ్బంది భరత్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు మిఠాయి రాజు, పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో మొక్కలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఎంపీడీఓల సంఘం డైరీ ఆవిష్కరణ

అనంతగిరి: తెలంగాణ ఎండీపీఓల సంఘం డైరీని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వికారాబాద్ ఎంపీడీఓ సత్తయ్య, టీజీఓ సంఘం అధ్యక్షురాలు మమత, సీఈఓ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, సంఘాల రాష్ట్ర నాయకులు తదితరులు ఉన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రులు తదితరులు

'తప్పుడు ప్రచారం మానుకోవాలి'

యాలాల: బీజేపీ నాయకులు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిపై చేస్తున్న ఆరోపణలు మానుకోవాలని, లేదంటే నాలుక చీరేస్తామని పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, హాజీపూర్ సర్పంచ్ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాఘవపూర్ ఉపసర్పంచ్ నర్సింహులుతో కలిసి మాట్లాడారు. బీజేపీ నాయకులు హన్మంతు, మహిపాల్‌లు భారస మండల అధ్యక్షుడిపై మాట్లాడిన తీరు, చేస్తున్న తప్పుడు ప్రచారం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటీవల కోకట్, ఎన్కెపల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులు బలవంతంగా పార్టీలో పలువురిని చేర్చుకున్నారని విమర్శించారు. కోకట్ గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు మాణిక్యం, బాల్‌రాజ్, రమేష్, లాలప్ప, శ్రీనివాస్‌లను వాజ్‌పేయి జయంతి సందర్భంగా రక్తదానం చేయాలని కోరితే అక్కడికి వెళ్లగా.. బలవంతంగా బీజేపీ కండువాలు కప్పారని ఆరోపించారు. దళితులను కుక్కతో పోల్చిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్‌కు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మౌలిక సదుపాయాలకు మొదటి ప్రాధాన్యత

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనతో అభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి అన్నారు. 3,15 వార్డుల్లో రూ.14 లక్షలతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను మంగళవారం ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. పురపాలికలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా శంకర్‌పల్లిని తీర్చిద్దిడానికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ జ్ఞానేశ్వర్, వైస్ చైర్మన్ వెంకటరాం రెడ్డి, కౌన్సిలర్లు బాలకృష్ణ, వాణి ప్రకాష్, లావణ్య, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తొలిమెట్టుతో గుణాత్మక విద్య



ప్రదర్శన తిలకిస్తున్న ఉపాధ్యాయులు

ఎంపీపీ విజయ్‌కుమార్

దౌల్తాబాద్: ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం తొలి మెట్టు కార్యక్రమం నిర్వహించిందని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. టీఎల్ఎం మేళాతో గుణాత్మక విద్య అందుతుందన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి బోధనభ్యాస సామగ్రి మేళాను నిర్వహించారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు సులువైన పద్ధతిలో బోధించే పరికరాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ మేళాతో భాషా పరిజ్ఞానంతో పాటు గణిత, చతుర్విత ప్రక్రియలపై పట్టు సాధించేందుకు బోధనోపకరణాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహిపాల్, సర్పంచ్ శిరీష, ఎంపీటీసీ శివమ్మ, నోడల్ అధికారి ఊషన్న తదితరులున్నారు.

'ఉపాధి' కూలీ ఇచ్చాకే గ్రామసభ

పెద్దేముల్: ఉపాధిహామీ కూలీ ఇచ్చిన తర్వాతే.. గ్రామంలో ఉపాధి గ్రామసభ నిర్వహించాలంటూ బుద్దారం గ్రామస్తులు మంగళవారం గ్రామసభను రద్దుచేశారు. పనులు చేసి నాలుగు నెలలు దాటినా.. నేటికీ తమ కూలీ అందలేదని మండిపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీకి డీఆర్‌పీలు వచ్చారు. పనులపై విచారణ చేపడుతుండగా.. కొందరు కూలీలు తాము చేసిన పనులకు నేటికీ డబ్బులు రాలేదని, గ్రామసభ వద్దని చెప్పారు. దీంతో ఎంపీడీఓ లక్ష్మప్ప, ఈసీ కృష్ణ గ్రామానికి వచ్చి ప్రజలతో మాట్లాడారు. కూలీ డబ్బులు అందే వరకు ఉపాధి సామాజిక తనిఖీ చేయరాదని కూలీలు పట్టుబట్టారు. ఎంపీడీఓ కలగజేసుకొని.. డబ్బులు చెల్లిస్తామని చెప్పినా వారు వినలేదు. మార్చి వరకు కూలీ అందచేస్తామని అధికారులు హామీ ఇచ్చినప్పటికీ.. గ్రామసభ నిర్వహణకు కూలీలు నిరాకరించారు.



గ్రామసభను వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ సభ్యులు, సిబ్బంది

అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గీత

చేవెళ్ల: కేజీబీవీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గీత డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని కేజీబీవీలో మంగళవారం కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 475 కేజీబీవీ హాస్టళ్లలో ఏడువేలకుపైగా నాన్‌టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నట్లు చెప్పారు. అతి తక్కువ వేతనాలతో మహిళా కార్మికులుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్న కార్మికుల సమస్యలు అనేకం ఉన్నాయని పేర్కొన్నారు. కనీసం వారాంతపు సెలవులకు కూడా నోచుకోక పనిఒత్తిడికి గురవుతున్నారని వాపోయారు. కార్మికుల సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ కోసం ఈ నెల 11న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే మహాసభలో చర్చించడం జరుగుతుందని, సభను విజయవంతం చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి, జీతాలు పెంచాలని, ఇతర ఉద్యోగులకు కల్పించినట్లుగా అన్ని సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్లు ప్రభుత్వం ముందుకు తీసుకుపోవాలని సంఘం నిర్ణయించనుందని చెప్పారు. కేజీబీవీ సిబ్బంది స్వప్న, రాజేశ్వరి, హైమావతి, సుజాత, నర్సమ్మ, లోఖ్మ, మనీల, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాజేశ్ పాల్గొన్నారు.



మర్పల్లిలో.. బీఎస్పీ నాయకులు



పరిగి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..



తాండూరు టౌన్‌లో నాయకులు, విద్యార్థినులు

మహిళా విద్యా ప్రదాత

- అణగారిన వర్గాల కోసం పరితపించిన మహనీయురాలు
- బాలికల విద్యకోసం అహర్నిశలు కృషి
- చదువుల తల్లి సావిత్రిబాయిపూలే జయంతిలో వక్తలు
- ఆమె ఆశయసాధనకు పాటుపడాలంటూ పిలుపు



పరిగి: మహనీయుల విగ్రహాలకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి: సావిత్రిబాయిపూలే ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని కొడంగల్‌చౌరస్తాలో సావిత్రిబాయి 192వ జయంతి సందర్భంగా ఆమె, తదితర మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. ఉపాధ్యాయురాలు, సంఘసంస్కర్త చదువుల తల్లి పూలేనని, మహిళలకు సమాజంలో చదువు ఎంతో అవసరమని సూచించడమే కాకుండా.. సొంత డబ్బుతో పాఠశాలలు ప్రారంభించి, విద్యను బోధించారు. దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా.. మహిళల అభ్యున్నతికి ఆమె ఎనలేని కృషి చేశారని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్, లాల్‌కృష్ణ, డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్ మాట్లాడుతూ బహుజన మహనీయులను స్మరించుకోకపోవడం విడ్డూరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే విజ్ఞానం

తాండూరు టౌన్: మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి పూలే అని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్ అన్నారు. సావిత్రిబాయి జయంతి సందర్భంగా స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాఠశాలలు ఏర్పాటుచేసిన మహనీయురాలని కొనియాడారు. ముఖ్యంగా బాలికల విద్య కోసం అహర్నిషలు కృషి చేశారని తెలిపారు. విద్యతోనే విజ్ఞానం వస్తుందని, తద్వారా అగ్రవర్ణాల దోపిడీకి అడ్డుకట్ట వేయవచ్చని తలచి చదువు చెప్పిందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ షుకూర్, జిల్లా నాయకులు వెంకటేశ్, నియోజకవర్గ కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు బస్వరాజ్, రాము, వెంకట్, శివ, నాగరాజు, సాయిప్రసాద్, మతిన్, ప్రిన్సిపాల్ పండరయ్య, వైస్ ప్రిన్సిపాల్ రూపారాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వివిధ సంఘాల ఆధ్వర్యంలో..

కొడంగల్ రూరల్: సావిత్రిబాయి జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, బీసీసేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, బీసీ సబ్‌ప్లాన్ ప్రధాన కార్యదర్శి కేశవులు, అంబేడ్కర్ యువజన సంఘం తాలూకా అధ్యక్షుడు రమేష్‌బాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, సంఘం నాయకులు శ్రీను, వివిధ సంఘాల నాయకులు ఈ సందర్భంగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు పార్వతి, అనిత, పద్మ, అర్చన, శ్రావణి, లక్ష్మి, రేణుక, కాశమ్మ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళాలోకం మహాత్మురాలు

బొంరాస్‌పేట: బహుజన మహిళాలోకం మహాత్మురాలు, దేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే అని వక్తలు కొనియాడారు. ఆమె జయంతి సందర్భంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు.



బంట్వారం: బార్వాద్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



యాలాలలో..



కుల్కచర్ల: చౌడాపూర్‌లో ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి తదితరులు